
# హిరమండలం రిజర్వాయర్ వద్దు!

సమాచార హక్కు చట్టం అక్టోబర్ నెలనుండి అమలులోకి రానుందట.

అప్పటి దాకా ప్రజలకు ఏ సమాచారము చెప్పొద్దని మన పాలకులు నిర్ణయించుకున్నట్టున్నారు.

వంశధార స్టేజ్-II దీనికొక మంచి ఉదాహరణ. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు ఎంత అసంబద్ధంగా ఉన్నాయంటే అది నిజమైన ప్రాజెక్టేనా లేక ఊహ అని ఎవరికైనా అనుమానం వస్తుంది. అది కాగితం మీద మాత్రమే ఉంటే నవ్వుకొని ఊరుకుందుముగానీ హిరమండలం రిజర్వాయర్ కోసం భూములు సేకరణ యత్నం, నిర్వాసితులను గుర్తించే యత్నం మొదలయి ఉండడంవల్ల ఇది నవ్వులాటకాదని అనుకోక తప్పడం లేదు.

PHASE II OF STAGE II OF VAMSADHARA PROJECT




భామిని మండలం నేరడి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజి వంశధార స్టేజ్-IIకు గుండెకాయలాంటిది. దాని నుండే ఈ ప్రాజెక్టుకు నీళ్ళు లభిస్తాయి. అయితే నేరడి బ్యారేజికి ఒరిస్సా అనుమతి ఇవ్వడం లేదు. వారిని ఒప్పించే ప్రయత్నమూ జరగడం లేదు. వివాద పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే ప్రయత్నమూ జరగడం లేదు. అసలు ఆ దిశగా మన రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న దాఖలాలే లేవు.

ప్రాజెక్టుకు నీటి మూలం అయిన నేరేడి బ్యారేజి అసలు సాధ్యమేనా అన్న సందేహం తీరకుండానే మిగిలిన ప్రాజెక్టు పనులు మాత్రం జరిగిపోతున్నాయి. 20 వేల ఎకరాలకు నీళ్లియ్యవలసిన వరదకాలువ పనులు మొదలయిపోయాయి. దాని మీద ఉన్న రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులూ మొదలయ్యాయి. కుడి ప్రధాన కాలువను పొడిగించే ప్రక్రియ కూడ జరిగిపోతూఉంది. 19 టి.ఎం.సి.ల సామర్థ్యంతో నిర్మించబోయే హిరమండలం రిజర్వాయరు భూమి సేకరణకు అవసరమయిన సర్వే ప్రారంభమయింది.

చివరికి ఒరిస్సా ప్రభుత్వం ఒప్పుకోకపోతే ఇదంతా ఎవరి నోట్లో పోసినట్టు?

నేరడి బ్యారేజికి ప్రత్యామ్నాయంగా కాట్రగడ దగ్గర నది సహజ ప్రవాహం నుండే నీటిని పక్కకు తీసి ప్రస్తుతానికి పని నడిపిస్తామని అంటున్నారు. దానివల్ల స్టేజ్-2కు అవసరమయినంత నీళ్ళు లభిస్తాయా? లభిస్తాయన్న శాస్త్రీయమైన అంచనా ప్రభుత్వం వద్ద ఉన్నదా? లభించవనీ, హిరమండలం రిజర్వాయరు నింపడానికి కాదు కదా, పూర్తిగా తడపడానికి కూడ కాట్రగడ నీటి మళ్లింపు పథకం చాలదనీ నిపుణులు అంటున్నారు. మరి నేరడి బ్యారేజి ఎప్పటికీ సాధ్యంకాక కాట్రగడతోనే వంశధార స్టేజ్-II సరిపెట్టుకోవలసివస్తే అంత కొంచెం నీటికి ఇంత భారీ తవ్వకాలూ, కట్టడాలూ ఎందుకు?

ఇదంతా ఎవరి నోట్లో పోయడానికి?

అసలు వంశధార స్టేజ్-II లెక్కలే విచిత్రమైనవి. మేము ప్రధానంగా ఆందోళన చెందుతున్నది. హిరమండలం రిజర్వాయర్ వల్ల నిర్వాసితులు కాబోయే 21 గ్రామాల గురించి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి కొండలలో బందీలు కాబోయే 82 గిరిజన గ్రామాల గురించీ కాబట్టి హిరమండలం రిజర్వాయర్‌ను దృష్టిలో ఉంచుకొని మాట్లాడుకుందాం.

హిరమండలం 19 టి.ఎం.సిల నీటి సామర్థ్యం గల రిజర్వాయరులో 19 టి.ఎం.సిల నీరు నిలువ చేస్తే, 25 నుండి 30 టి.ఎం.సిల దాకా పారించుకోవచ్చు. కానీ వంశధార స్టేజ్-II ఆయకట్టు 1,07,000 ఎకరాలని ప్రభుత్వం అంటున్నది. అందులో 20,000 ఎకరాలు హిరమండలం రిజర్వాయర్‌కు ఎగువన కట్టబోయే వరదకాలువ ఆయకట్టు కాబట్టి దానికి నీళ్ళు హిరమండలం రిజర్వాయర్ నుండి తీసుకోరు. ఆ 20,000 తీసేస్తే మిగిలిన ఆయకట్టు 87,000 ఎకరాలు.

ఇది ప్రధానంగా వంశధార కుడి ప్రధాన కాలవ ద్వారా నీరు పొందుతుంది. అయితే కుడి ప్రధాన కాలవకు వంశధార నది నుండే ఇప్పటికే నేరుగా 30,000 ఎకరాల మేరకు నీళ్ళు ఇస్తున్నారని ప్రభుత్వమే చెప్పుకుంటున్నది. గొట్టబ్యారేజికి ఎగువన మూడేళ్ల నాడు నిర్మించిన కుడి హెడ్‌రెగ్యులేటర్ నుండి ఈ మొత్తం ఇప్పటికే ఇవ్వడం జరుగుతున్నది. గొట్టాబ్యారేజి (వంశధార స్టేజ్-I) కారణంగా దిగువన దెబ్బతిన్న పాతకాలపు యెరగాం, పురుషోత్తపురం, భైరి ఓపెన్‌హెడ్ కాలవల ఆయకట్టు అవసరాలను భర్తీ చేసే చిన్న ఉద్దేశ్యంతో మొదలు పెట్టిన ఈ కుడి ప్రధాన కాలవ ఆయకట్టు ఇప్పటికే 30,000 ఎకరాలను చేరుకుంది. (నిజానికి ఇంకా ఎక్కువే ఇస్తున్నారని రైతులు అంటున్నారుకానీ, వాదన కోసం ప్రభుత్వాన్నే నమ్ముదాం)

ఇంక మిగిలింది 57,000 ఎకరాలు. హైలెవెల్ కెనాల్ నుండి నీరు పొందే 5000 తీసేస్తే, కుడి ప్రధాన కాలవ ద్వారా హిరమండలం రిజర్వాయర్ నుండి నీళ్లు పొందవలసింది 52,000 ఎకరాలు. 52,000 ఎకరాలకు 5 టి.ఎం.సిలు చాలు, నీళ్ళు దండిగా ఇస్తే 8 టి.ఎం.సిలు చాలు. 5 లేక 8 టి.ఎం.సిల నీళ్ళు పారించుకోవడానికి 3 లేక 5 టిఎంసిల సామర్థ్యంగల రిజర్వాయర్ చాలు.

మరి 19 టి.ఎం.సిల సామర్థ్యంతో హిరమండలం రిజర్వాయర్ ఎందుకు నిర్మిస్తున్నట్టు? 21 గ్రామాల సస్యశ్యామలమైన భూములను ఎందుకు ముంచుతున్నట్టు? 82 ఆదివాసీ గ్రామాలలో కొండల మీద ఎందుకు బందీ చేస్తున్నట్టు?

ఎన్నిసార్లు అడిగినా ఈ ప్రశ్నకు ప్రభుత్వం నుండి జవాబు లేదు. వారు జవాబు చెప్పరు కాబట్టి మనం వారు చేపడుతున్న నిర్మాణాల నుండి ఊహించుకోవలసిందేతప్ప గత్యంతరం లేదు. మన సమాచార హక్కు దుర్గతి అది.

హిరమండలం రిజర్వాయర్‌ను తిరిగి నదికి కలుపుతూ నిర్మిస్తున్న **'లింక్'** కాలవలో ఈ రహస్యం ఉండాలి. కాట్రగడ దగ్గర (నేరడి సంగతి మరచి పోవడం మంచిది) పక్కకు తీసిన నీటిలో కొంత భాగాన్ని ఈ లింక్ కాలవ ద్వారా తిరిగి నదిలోకి పోస్తారు. ఇది గొట్టాబ్యారేజి (వంశధార స్టేజ్-I) ఆయకట్టు స్థిరీకరణకు కోసం ఉపయోగపడుతుందని అంటున్నారు. దీనికైనా ఎంత నీళ్ళు అవసరం ఉండబోతాయి?

వంశధార-I ఆయకట్టు 1,48,000 ఎకరాలు. అది పూర్తిగా అందుతూవుంది.అందులో పూడిక కారణంగా 17,000 ఎకరాలకు నీళ్లందని పరిస్థితి రాగా, 1998లోనే దీనిని సరిదిద్దడానికి నిధులు సమకూర్చి 37 నీటి వినియోగదారుల సంఘాల ద్వారా కాలవ నిర్వహణ పనులు చేపట్టి మరమ్మతులు చేసినట్టు ప్రభుత్వం చెప్పుకుంటున్నది. పూడిక సమస్య కూడ ఈ విధంగా తీరిపోయినట్టయితే ఇంక **'స్థిరీకరణ'**కు ఎంత నీళ్ళు కావాలి? వంశధార స్టేజ్-I ద్వారా నీళ్లిస్తున్నది మొదటి పంటకు. ఆ సీజన్‌లో స్టేజ్-Iకు అవసరమైన నీళ్లే కాక ఎగువన ఉన్న కుడిహెడ్ రెగ్యులేటర్ నుండి కుడి ప్రధాన కాలవ ద్వారా 30,000 ఎకరాలకు ఇప్పటికే నీళ్లివ్వగలుగుతున్నారు. ఇంక స్థిరీకరణ ఎక్కడిది?

లింక్ కెనాల్ నీళ్లివ్వబోయేది వంశధార స్టేజ్-I స్థిరీకరణకా, లేక అదే ఆయకట్టుకు రెండవ పంట నీటికా? అన్న సందేహం రాకమానదు. ప్రభుత్వం జవాబు చెప్పదు కాబట్టి మనం ఊహించుకోవలసిందే. 19 టి.ఎం.సిల హిరమండలం రిజర్వాయర్ నిర్మాణానికి కుడి ప్రధాన కాలవ కింద కొత్త ఆయకట్టును కారణంగా చూపుతున్నప్పటికీ, ఎడమ కాలవ కింద 1,48,000 ఎకరాలకు రెండవ పంటకు నీళ్లివ్వడమే దాని ప్రధాన లక్ష్యం అని అర్థం అవుతుంది. (అయినప్పటికీ 19 టిఎంసిల రిజర్వాయర్ అక్కరలేదు. 13-15 టి.ఎం.సిల సామర్థ్యం ఉంటేచాలును. అది వేరే విషయం)

ఇదే నిజమయితే ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయవలసి ఉంది. ముంపు బాధితుల కోణం నుండి ప్రాజెక్టులను ఎప్పుడు విమర్శించినా 'అభివృద్ధి'కి అడ్డం వస్తున్నారని ఎదురు దాడి చేస్తారు. సాగునీరు లేని ప్రాంతాలకు సాగునీరివ్వడం వాంఛనీయమైన అభివృద్ధేనని ఒప్పుకుందాం. కానీ ఇప్పటికే ఒక పంటకు నీరు పొందుతున్న వారికి రెండవ పంటకు

నీళ్లివ్వడం కూడా అంతే అవసరమా? దాని కోసం కూడ ఇతరులు '**త్యాగం**' చేయవలసిందేనా?

ఇది వరకటిలాగ ప్రతీ ప్రాజెక్టునూ అభివృద్ధిగానూ ముంపునంతా అనివార్యంగానూ చూసే రోజులు పోయాయి. అభివృద్ధి అవసరమే కానీ, అది విధ్వంసకరం కాని అభివృద్ధి అయివుండాలని ఇవాళ నాగరిక ఆలోచనారీతి భావిస్తున్నది. ముంపు తప్పనిసరి అయితే ఆ ముంపు వల్ల బాధితులయ్యేవారికి కూడ అదే ప్రాజెక్టు కింద భూములివ్వడం ద్వారాగానీ ఇతరత్రాగానీ మెరుగయిన జీవనాన్ని ఇవ్వడం కూడ ప్రాజెక్టు రూపకల్పనలో భాగం కావాలని భావిస్తున్నది. ఈ ఆలోచనలు మన పాలకులకింకా తోచలేదు గానీ నాగరిక ప్రపంచం ఈ విషయాలను ఏవిధంగా చూస్తున్నదో ప్రజలయినా తెలుసుకోవడం అవసరం.

**'విధ్వంసకరంకాని అభివృద్ధి'** అనే ప్రమాణాన్ని పెట్టుకొని చూసినప్పుడు ఒక పంటకు ఇప్పటికే నీళ్లిస్తున్నవారికి రెండవ పంటకు కూడ ఇవ్వడానికి పెద్ద ఎత్తున ముంపును ఆహ్వానించడం సమర్థనీయం కాదు. భారీ ప్రాజెక్టులు కట్టేసి రాష్ట్ర భగీరథులుగా, జిల్లా భగీరథులుగా చలామణి కావడం రాజకీయనాయకులకు సంతోషం కలిగించే విషయం కావచ్చును గానీ ప్రజలు దానికోసం త్యాగాలు చేయనక్కర లేదు.

హిరమండలం రిజర్వాయర్ నిర్వాసితుల పక్షాన ఈ మాటలు అంటున్నామని మొదటే చెప్పాము కాబట్టి ఇక వారి విషయం మాట్లాడుకుందాం. నిర్వాసితుల భవితవ్యాన్ని కూడ ప్రాజెక్టులో భాగం చేసి వారికి సహితం ప్రాజెక్టుద్వారా, లేక ప్రాజెక్టుకు అనుబంధంగా, మెరుగయిన జీవితాన్ని అందిచే సమకాలీన ఆలోచనా రీతి మన తరాలకింకా తోచలేదని చెప్పాము. మనకు నిన్నటి దాకా ఒక పునరావాస హక్కేలేదు. పునరావాసం ప్రభుత్వమిచ్చే భిక్షగా ఉండింది. ఇప్పుడు పరిస్థితి కొంచెం మారి ఒక మేరకు పునరావాస హక్కు కల్పించే విధానం వచ్చింది. జీవో 68 అనే విధాన ప్రకటన పత్రంలో దానిని రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిచింది.

ఈ విధాన పత్రం 6వ అధ్యాయంలో పునరావాస హక్కు స్వరూపస్వభావాలను వివరించారు. భూమి సేకరణ వల్ల స్థిరాస్తులు కోల్పోయిన వారికి ఎప్పటి లాగే నష్టపరిహారం దక్కుతుంది. అందులో మార్పేమిలేదు. నిర్వాసిత గ్రామాన్ని తిరిగి ఒక గ్రామంగానే ఇంకోక చోట అన్ని వసతులతోనూ నిర్మించాలన్న డిమాండ్ ఏదయితే ప్రజాస్వామిక ఉద్యమాలు చేస్తున్నాయో అటువంటి పునరావాస హక్కేదీ ఈ విధాన పత్రంలో లేదు. వేరే ఎక్కడయినా ఇళ్లస్థలం ఫ్రీగా పొందాలంటే ఇప్పుడు కోల్పోయిన స్థలానికి నష్టపరిహారం వదులుకోవాలి. కోల్పోయిన ఇంటికి మారుగా ఇల్లు కట్టుకోవడానికి దరిద్ర రేఖకు దిగువన ఉన్నవారికి మాత్రం 40 వేల రూపాయలిస్తారు. ముంపుకు గురయిన సాగుభూమికి ప్రత్యామ్నాయంగా అంతే సాగుభూమి పొందే హక్కులేదు. ఒకవేళ ఎక్కడయినా ఎవరి ఆక్రమణలో లేని సాగు యోగ్యమైన ప్రభుత్వ భూమి అందుబాట్లో ఉంటే ఇస్తారు. అయితే ఆ మేరకు ముంపుకు గురయిన భూమికి నష్టపరిహారం వదులుకోవలసి వస్తుంది.

మరి కొత్తగా ఉన్న హక్కేమిటి ఈ పునరావాస విధాన పత్రంలో అంటే, ముంపుకు గురయినవారు తిరిగి మళ్లీ ఎక్కడయినా జీవనాన్ని పొందడానికి కొంతకాలం పడుతుందని గుర్తించి ఆ కాలం గడవడానికి ఆర్థిక సహాయం ప్రభుత్వం చేస్తుంది. భూమి పూర్తిగా కోల్పోయిన రైతులకు 750 రోజుల కనీస వేతనం లెక్కగట్టి చేతిలో పెడుతుంది. వ్యవసాయ కూలీలకు ఇతర వృత్తుల వారికీ 625 రోజుల కనీస వేతనం చేతిలో పెడుతుంది. భూమి సేకరణ వల్ల చిన్నకారు రైతులుగా మారిన వారికి 325 రోజుల కనీస వేతనం, సన్నకారు రైతులుగా మారిన వారికి 500 రోజుల కనీస వేతనం ఒక్కసారిగా ఇవ్వడం జరుగుతుంది. ఇంకా చిన్న, చితక విషయాలు ఈ **'పునరావాస విధాన పత్రం'**లో ఉన్నాయిగానీ ఇప్పటి దాకా లేనిదీ కొత్తగా ఇస్తున్నదీ ఈ ఆర్థిక సహాయం ఒక్కటే. **'దీనికి సహాయ పునరావాస విధానం'** అని పేరు పెట్టినప్పటికీ ఇది నిజానికి పునరావాస విధానం కాదు. కొంచెం మెరుగయిన నష్టపరిహార విధానం మాత్రమే.

కాబట్టి ముంపుకు గురి కాబోయే ప్రజల జీవన ప్రమాణం ఇప్పుడున్నట్టు ఇక మీదట ఉండబోదనేది (బాగా నష్టపరిహారం పొందగల పెద్ద రైతులను మినహాయిస్తే) స్పష్టమే. ఇవి ఒకటీ రెండూ కుటుంబాలుకావు. దాదాపు 30 వేల నుండి 40 వేల జనాభా నిర్వాసితులవుతారు. ప్రభుత్వం లెక్క ప్రకారం పొలం మాత్రమే పోయి ఇల్లు భద్రంగా ఉంటుంది అనే కోవకు చెందినవారు కూడ అక్కడే ఉండి బతకలేరు. జీవో 68 ప్రకారం వారుకూడా **'ప్రాజెక్టు బాధిత కుటుంబాల'** లెక్కలోకి వస్తారు.

ఇది హిరమండలం రిజర్వాయర్‌లో ప్రత్యక్షంగా ముంపుకు గురయ్యే 21 మైదాన గ్రామాల విషయంకాగా,

రిజర్వాయర్‌కు ఆవలనున్న కొండలలో బందీ కాబోయే 82 ఆదివాసీ గూడెంల ప్రజలది మరింత సంకటస్థితి. ప్రభుత్వం లెక్కలలో వారివి **'ముంపుగ్రామాలు'** కావు. రిజర్వాయర్ నీటిమట్టం ఎంతవరకు ఉంటే అంత మేరకు మాత్రమే నీటి పారుదల శాఖ లెక్కలో **'ముంపు ప్రాంతం'**. రిజర్వాయర్ నీటి మట్టం మరియు వంద మీటర్లు ఎగువ వరకు నీటి పారుదలశాక లెక్కలు వేసినదే ముంపు ప్రాంతం జీవో 68 రూపంలో జారీ అయిన పునరావాస విధాన పత్రం కూడ ముంపు ప్రాంతంలో ఏదయినా వృత్తి చేసుకొని బతుకుతున్న వారిని **'ప్రాజెక్టు బాధిత కుటుంబాలు'**గా గుర్తిస్తుందే తప్ప ప్రాజెక్టు వల్ల రాకపోకలు బంద్ అయిపోయేకారణంగా జీవనం కొనసాగించడం అసాధ్యం అయ్యే వారిని గుర్తించదు. ఇటువంటి బాధితులు ప్రతీ ప్రాజెక్టుకు ఉంటారని అనేక సందర్భాలలో ప్రభుత్వం దృష్టికి వస్తూనే ఉన్నా, లేక లేక రూపొందించిన ఈ పునరావాస విధాన పత్రంలో వారికి గుర్తింపు ఇవ్వలేదు. హిరమండలం రిజర్వాయర్ విశిష్టత ఏమంటే ఇటువంటి బాధితులు పెద్ద సంఖ్యలో ఉండడం, వారందరూ ఆదివాసులు కావడం. 82 గూడెంల ప్రజలకు ముందు నీళ్లు వెనక కొండలు బయటి ప్రపంచం నుండి రాకపోకలకు ఆటంకంగా ఉంటాయి. బయలు ప్రదేశంలోనే బందీలయి బతకవలసి ఉంటుంది.

వీరి గురించి మేము ఇప్పటికే అధికార యంత్రాంగం దృష్టికి ఒకటికి నాలుగు సార్లు తీసుకొచ్చినప్పటికీ మేము వ్యక్తం చేస్తున్న ఆందోళన నిజమా కాదా అన్న విచారణ సహితం అధికారులిప్పటిదాకా చేపట్ట లేదంటే 'అభివృద్ధి' సాధించామని చెప్పుకోవాలన్న కోరిక, భగీరథుల మనిపించుకోవాలన్న నాయకుల దాహం, వారినెంత అమానుషంగా తయారు చేస్తున్నయో గ్రహించవచ్చు.

- ☞ హిరమండలం రిజర్వాయర్ ప్రతి పాదన విరమించుకోవాలి.
- ☞ వంశధార ఎడమకాలవ ఆయకట్టుకు రెండవ పంటకు నీళ్లిచ్చే ఆలోచన విరమించి కుడి ప్రధాన కాలవ ఆయకట్టుకు ప్రస్తుతం ఉన్న కుడి హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నది నుండే నేరుగా నీళ్లు తీసుకోవాలి.
- ☞ కాట్రగడ పథకాన్ని వరద కాలవకే పరిమితం చేయాలి.
- ☞ జీవో 68ని పూర్తిగా తిరగరాసి సమకాలీన/ ప్రజాస్వామిక ఆలోచనలకు అనుగుణంగా సమగ్ర పునరావాస విధానంగా రూపొందించాలి.
- ☞ 'అభివృద్ధి'కి ఆదివాసులను సునాయసంగా బలిచేసే అమానుష పాలనా వైఖరిని విడనాడాలి.

**శ్రీకాకుళం**
**1 సెప్టెంబరు 2005**

**మానవ హక్కుల వేదిక** (HRF)
**ఆం.ప్ర.వ్యవసాయ వృత్తిదారుల సంఘం** (APVVU)